క్లుప్తంగా

మొరం తరలింపు అడ్డగింత

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ గుండ్లపహాడ్ శివారులోని గుట్టను జేసీబీతో తవ్వి లారీలతో మట్టిని(మొరం)తరలిస్తుండగా ఆదివారం స్థానికులు అడ్డుకున్నారు. ఇష్టానుసారంగా లారీల్లో మట్టిని తరలిస్తుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతుందని, ఇంత పెద్ద గుట్టను తవ్వడం ఏంటని, అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. గతంలో కూడా అడ్డుకున్నామని, మళ్లీ అనుమతులున్నాయంటూ తవ్వకాలు చేపట్టడం దారుణమన్నారు. కాగా గుట్టను తవ్వడానికి అనుమతులు ఇవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా గుట్టను తవ్వేందుకు అనుమతులు ఇవ్వలేదని, రైల్వే అవసరాల కోసం అత్యవసరంగా మట్టి కావాలని ప్రభుత్వ భూమి సూచించాలని తెలపగా, ముత్యంపల్లిలో 189సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉందని సూచించినట్లు తెలిపారు. భూగర్భ శాఖ అధికారులు సైతం 1.08హెక్టర్ల భూమి 189సర్వే నంబర్ అని అనుమతులు ఇచ్చారని, అందులో గుట్టను పొందుపరచలేదన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీమాత హోమం



హోమం చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో చండీమాత హోమాన్ని నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మి, శ్రీ దుర్గ, శ్రీ మహా సరస్వతీ మూల మంత్రాలను పారాయణం చేసి వివిధ రకాల హోమ ద్రవ్యాలను హోమ గుండంలో సమర్పించారు. లోక కల్యాణం కోసం ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పాలకవర్గం, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'



మాట్లాడుతున్న చెన్నూరి సమ్మయ్య

పాతమంచిర్యాల: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సమ్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అన్ని రాష్ట్రాల కంటే ముందుగా అమలు చేస్తానని మాటిచ్చారని, ఇచ్చిన మాటను నెరవేర్చకుండా మాదిగలను మోసం చేసి డీఎస్సీ ఫలితాలను ప్రకటించి నియామకపత్రాలు ఈ నెల 09న ఇస్తానని ప్రకటన చేశారని, ఇందుకు నిరసనగా ఈ నెల 09న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. ఏబీసీడీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ సమితి నాయకులు పాల్గొన్నారు.

నాగమణికి గల్ఫ్ కార్మికుల సన్మానం



నాగమణిని సన్మానిస్తున్న కార్మికులు

జన్నారం: గల్ఫ్ కార్మికుడు ఎల్లయ్య కుమార్తె నాగమణికి ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు లభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నాగమణి, తండ్రి ఎల్లయ్యలను సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ... గల్ఫ్‌లో పని చేస్తూ కూతురును చదివించి, ఎంబీబీఎస్ డాక్టర్‌ను చేయడం అభినందనీయమన్నారు. గల్ఫ్ కార్మికులు ఎల్లయ్యను ఆదర్శంగా తీసుకొని, పిల్లలను మంచి చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో మర్రిపెల్లి అంజయ్య, ఖాదర్‌ఖాన్, రమేశ్‌గౌడ్, మగ్గిడి తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, చంద్రమౌళి గౌడ్, హసన్, రవి, హబీబ్, శేఖర్, సింహరాజు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ యువకులు ఆదివారం తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 70యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

దుర్గమ్మా..దీవించు

• కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు • ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

జన్నారం: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని కనకదుర్గ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనం ఇచ్చారు. గంధం చీరను అలంకరించి, అమ్మవారికి దద్దోజనం నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తితో పూజలు చేస్తే ధన, ధాన్య ప్రాప్తి కలుగుతుందని నిర్వాహకులు ప్రశాంత్, అనిల్, సంతోష్‌లు తెలిపారు. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారికి పూజలు జరిపారు.



రాళ్లపేట్ రోడ్ నంబర్-1లో శాకాంబరిగా దర్శనమించిన అమ్మవారు

శాకాంబరిగా దర్శనం

మంచిర్యాలఅర్బన్: శరన్నవరాత్రుల్లో భాగంగా పలు, ఆలయాలు, కూడళ్లలో నెలకొల్పిన దుర్గామాత ఆదివారం శాకాంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి వివిధ కూరగాయలు, పండ్లతో విశేష అలంకరణ చేశారు. స్థానిక కోదండ రామాలయం, రాళ్లపేట్ రోడ్ నంబర్-1లో శివాపంచాయితన ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారిని కూరగాయలతో అలంకరించగా భక్తులు దర్శనం చేసుకున్నారు.



కోదండ రామాలయంలో....



మహిళల కోలాట ప్రదర్శన

మహాసంకల్ప శోభాయాత్ర



అమ్మ వారి ఉత్సవం విగ్రహం, 108 కలశాలతో మహిళలు

మంచిర్యాలఅర్బన్: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాలలో దుర్గామాత మహా సంకల్ప శోభాయాత్ర నిర్వహించారు. విశ్వనాథ ఆలయం నుంచి 108కళశాలతో ఆర్‌బీహెచ్‌వీ స్కూల్ గ్రౌండ్ వరకు శోభాయాత్ర జరిపారు. మహిళల కోలాటా ప్రదర్శనలు అలరించాయి. అమ్మకు ప్రతిరూపం ఆడిపిల్ల.. ఆమెను అమ్మబడిలో ఆడనిద్దాం.. ఆడపిల్లల రక్షణ.. మనందరి బాధ్యత అంటూ.. ప్లకార్డులు ప్రదర్శించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుకుమార్, కో-ఆర్డినేటర్స్ కవిత, సునిత, జ్యోత్స్న చంద్రదత్, చందన, మంజుల, తేజస్విని, మార్వాడీ యువమంచ్ సభ్యులు పాల్గొన్నారు.



సోమగూడెం వర్తకసంఘం మండలి వద్ద పూజలు

కాసిపేటలో...

కాసిపేట: మండలంలోని సోమగూడం, కాసిపేట, దేవాపూర్, దుబ్బగూడం గ్రామాల్లో ఆదివారం దుర్గమాత విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గామాతకు సోమగూడం వర్తకమండలి ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.



మైదానంలోని దుర్గామాత వద్ద పూజలు

పోలీస్ బెటాలియన్‌లో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గ్రామాల్లో ఓ వైపు దుర్గాదేవి నవరాత్రి పూజా మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతుండగా, మరోవైపు గ్రామాల్లో బతుకమ్మ ఆటలు కనుల పండువగా జరుగుతున్నాయి. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పలుచోట్ల అన్నదానాలు నిర్వహిస్తున్నారు.



పూజల్లో పాల్గొన్న కమాండెంట్ వెంకటరాములు

అన్నపూర్ణ దేవిగా దర్శనం

మందమర్రిరూరల్: మందమర్రిలోని పలు ఆలయాలతో పాటు కాలనీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాలుగో రోజు సందర్భంగా అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాత బస్టాండ్ ఏరియాలోని విద్యానగర్ కాలనీలో అర్చకులు వెంకట రమణచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక పూజలో కమిటీ సభ్యులు



అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర

బీజేపీతోనే మెరుగైన పాలన

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. మున్సిపాలిటీలోని 106పోలింగ్ బూత్ టేకుల బస్తీలో ఇంటింటికి వెళ్లి కమలనాథులు సభ్యత్వం చేయించారు. గడిచిన కొద్ది రోజుల నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని సభ్యత్వ నమోదు చేయిస్తున్నారు. యువకులు, మహిళలు ముందుకు వచ్చి జోష్‌గా సభ్యత్వం తీసుకుంటున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటకృష్ణ, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ అధ్యక్షురాలు దార కల్యాణి, సభ్యత్వ నమోదు కన్వీనర్ మద్దెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: బీజేపీతోనే గ్రామాల్లో, దేశంలో మెరుగైన పాలన సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి అన్నారు. బెల్లంపల్లి మండలం లంబాడితండాలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురికి బీజేపీ సభ్యత్వ నమోదును అందజేశారు. గ్రామ స్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



బెల్లంపల్లిరూరల్: మాట్లాడుతున్న ఏమాజీ

మోదీ నాయకత్వంలోనే దేశ రక్షణ సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, సీనియర్ నాయకులు కేశవరెడ్డి, అజ్మీరా శ్రీనివాస్, ప్రకాష్, రాములు ,శ్రావణ్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్-3వ శక్తి కేంద్రంలో శక్తి కేంద్ర కన్వీనర్ బెడ్డి బాలరాజు, కో కన్వీనర్ వనిత ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు సంతోష్, రాంచందర్, సదయ్య, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

భీమిని: కన్నెపల్లి, భీమిని మండల కేంద్రాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి అందిన సమాచారంతో తాండూర్ సీఐ కుమారస్వామి, భీమిని, కన్నెపల్లి ఎస్సైలు విజయ్ కుమార్, గంగారాం సిబ్బందితో కలిసి దాడులు చేయగా భీమినిలో 35క్వింటాళ్ల బియ్యం జంగంపల్లి శంకర్ ఇంట్లో, కన్నెపల్లిలో 13క్వింటాళ్ల50కిలోల రేషన్ బియ్యం సముద్రాల శంకరయ్య ఇంట్లో పట్టుబడ్డాయి. రేషన్‌బియ్యాన్ని స్వాధీనపర్చుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల కళాజాత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలం గుడిపేట-నంనూర్ పునరావాస కాలనీలో ఆదివారం పోలీసుల కళాజాత బృందం పలు సామాజిక అంశాలపై, ఎలాంటి మోసాలకు గురికాకుండా ఉండాలంటూ చైతన్య గీతాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై గోపతి సురేశ్ ఏఎస్సై చాంద్ పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యువతి న్యాయ పోరాటం

• ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

నెన్నెల: తనను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేసిన ప్రియుడి కోసం ఆదివారం న్యాయపోరాటానికి దిగింది ఓ గిరిజన యువతి. తనతో పెళ్లి జరిపించాలని, అంత వరకు కదిలేది లేదని ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన జంబి అంజలి, గొల్లపల్లి గ్రామానికి చెందిన రేచవేణి రాజశేఖర్ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి రాజశేఖర్ శారీరకంగా లోబర్చుకున్నట్లు, పెళ్లి చేసుకుందామని అడగడంతో నిరాకరించినట్లు తెలిపింది. పెళ్లి చేసుకునే వరకు ఇలాగే ఇంటి ఎదుట నిరసన తెలుపుతానని, న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలనని భీష్మించుకొని కూర్చుంటానని ఆవేదన వ్యక్తం



ప్రియుడి ఇంటి ముందు బైఠాయించిన యువతి

చేసింది. తాను ఇంటి ఎదుట కూర్చుండటంతో ఇంటికి తాళం వేసి, ప్రియుడి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారని చెప్పింది. ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లానని, తన ప్రియుడితో ఎలాగైనా పెళ్లి చేయించాలని వేడుకుంది.

ఇన్‌చార్జీల పాలన ఇంకెన్నాళ్లో!

- చుట్టం చూపుగా వచ్చిపోతున్న అధికారులు
- రెగ్యులర్ ఉద్యోగులు లేక అవస్థలు
- ఇబ్బంది పడుతున్న మండల ప్రజలు

కోటపల్లి: ఇన్‌ఛార్జీల పాలన ఇంకెంత కాలమంటూ గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగడం తప్పా, సమస్యలు పరిష్కారం కావడంలేదటూ మండల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో కోటపల్లి మండలం అనగానే అధికారులు విముఖత వ్యక్తం చేయడం, వచ్చినా అధికారులు ఏదోఒక విధంగా పోవడానికే చూస్తుంటారే తప్పా, మండలవాసుల బాధలను పట్టించుకునే వారే కరువయ్యారు. అడపాదడపా ఇన్‌ఛార్జీలు వచ్చిపోతున్నా, వినతులు తీసుకోవడమే కానీ పరిష్కారం మాత్రం శూన్యమని వాపోతున్నారు.

పాలకులు మారినా సమస్యలు తీరట్లే...

ప్రభుత్వాలు.. పాలకులు మారినా అధికారుల సమస్యలు మాత్రం తీరడంలేదు. అంతా ఇన్‌ఛార్జీ అధికారుల పాలనలో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఓ అధికారికి రెండు నుంచి మూడు మండలాలు బాధ్యతలు ఉంటడంతో, వారు ఎటూ న్యాయం చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోటపల్లి మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న భూమన్న వ్యక్తిగత కారణాలతో వెళ్లడంతో అప్పటి నుంచి ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణకు ఎంపీడీవోగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు. దీంతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యవసాయాధికారి మహేందర్ మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లగా ఇప్పటి వరకు ఏవోను నియమించకపోగా, ఇన్‌ఛార్జీగా జైపూర్ ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్‌కు ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పగించగా జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి నాలుగు మండలాల బాధ్యతలను నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మండల సమాఖ్యలో ఇన్‌ఛార్జీ ఏపీఎంగా మూడు సంవత్సరాలుగా వెంకటేశ్వర్ సీసీ నే కొనసాగుతుండగా, మండలసమాఖ్య ఆడిట్‌లో అవకతవకలు జరిగినట్లు అధికారులు దృష్టికి వెళ్లడంతో ఇన్‌ఛార్జీ ఏపీఎం వెంకటేశ్వర్‌కు, సీసీలకు మోమోలు జారీ చేసి చేతులు దులుపేసుకున్నారు. మండల సమఖ్యా స్త్రీనిధిలో రూ.కోట్లు దుర్వినియోగం అవుతున్నాయని ఫిర్యాదు అందినా, అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విస్తీర్ణంలో పెద్దమండలం మారుమూల మండలం పంచాయితీరాజ్ ఏఈ పోస్టుకు ఇన్‌ఛార్జీగా జైపూర్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారికే అప్పగించారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో అధికారులు లేక పాలన కుంటుపడుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టి సారించి, అన్ని శాఖలకు అధికారులను కేటాయించి మండల వాసులకు అందుబాటులో ఉండి మెరుగైన పాలన అందించాలని మండలవాసులు కోరుతున్నారు.



కోటపల్లి మండల పరిషత్ కార్యాలయం

సంక్షిప్త వార్తలు

నూతన కార్యవర్గం

పాతమంచిర్యాల: మంచిర్యాల టూ వీలర్ మెకానిక్స్ అండ్ వర్కర్స్ యూనియన్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్ణకంటి రవీందర్, ఉపాధ్యక్షుడిగా మడుపు శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శిగా రామగిరి శ్రీనివాస్, కోశాధికారిగా అన్వర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'ప్రజలు తిరస్కరించినా బుద్ధి రాలేదా'

చెన్నూర్: నియోజకవర్గ ప్రజలు తిరస్కరించినా, బాల్క సుమన్‌కు బుద్ధిరాలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా వివేక్ పని చేస్తున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేక సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, చీర్ల సుధాకర్‌రెడ్డి, మహేశ్ తివారి, శ్రీధర్, పాతర్ల నాగరాజు, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేటలో రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ధర్మరావుపేట, కొండాపూర్, తాటిగూడం, కోనూరు, లంబాడితండా(డీ) పంచాయతీలలోని 1200మంది మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారులకు చెన్నూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు ఇలియాజ్ ఆదివారం వాలీబాల్ కిట్లను అందజేశారు. యువకులను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సూరం రాజశేఖర్‌రెడ్డి, బోగె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని మాలగురిజాల గ్రామంలో ఆదివారం క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. మాలగురిజాల గ్రామానికి చెందిన గోమాస శివప్రసాద్ జ్ఞాపకార్థం మిత్రులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ ప్రారంభించారు. ఎస్సై ఆటగాళ్లను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాలగురిజాల మాజీ సర్పంచ్ గోమాస అశోక్, నిర్వాహకులు సాగర్, ప్రశాంత్, శ్రావణ్, భాస్కర్, గ్రామస్తులు దేవదాస్, శ్రీనివాస్, గంగారాం, సురేందర్, నర్సయ్య, శివప్రసాద్ కుటుంబీకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ప్లంబర్ కార్మికుడిగా పనిచేస్తున్న వాజీద్‌ఖాన్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా మంచిర్యాల ప్లంబర్ అసోసియేషన్ సభ్యులు అతడి కుటుంబానికి రూ.5000, నిత్యావసర వస్తువులను కుటుంబ సభ్యులకు అందించారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.